# ప్రవృత్తులు

'కళ్ళులేవు బాబూ! ఒక్క కానీ ధర్మం చెయ్యండి బాబూ!!' అంటూ చెయ్యిజాపి అడుగుల చప్పుడైనప్పుడల్లా అరుస్తున్నా కూడా ప్రతివారూ తమని కాదన్నట్టు ఎవరి పనిమీద వాళ్లు వెళ్ళిపోతున్నారు.

టక, టకమని చప్పుడవుతూ ఎవరో వస్తున్నట్టు అనిపించగానే మళ్ళీ అతను దీనంగా అడగటం ప్రారంభించాడు.

'రెండు రోజుల్నుంచీ తిండిలేదు బాబూ ఆకలితో చచ్చిపోతుండాను..'

అడుగులశబ్దం ఆగిపోయింది.

గట్టిగా ఒక నవ్వు వినిపించింది.

మనిషి ఇంకా అక్కడే వున్నాడని గ్రహించిన గుడ్డివాడు ఇంకా దీనంగా ప్రార్థించటం ప్రారంభించాడు.

'విశ్వామిత్ర'

'ఊఁ-! ఇదుగో!' గర్వంగా ఒక కాసు అతని చేతిలోపడేసి ఆ వ్యక్తి వ్యంగ్యంగా నవ్వటం ప్రారంభించాడు. ఆ నవ్వులో అదో విధమైన గర్వంకూడా కలిసింది.

వేలుతో నాణెం చుట్టుని తడివి చూసుకొని అది అణా అని గ్రహించి, సంతోషంతో మొహం పెద్ద చేసుకొన్నాడు గుడ్డివాడు.

'ధర్మ ప్రభువులు!' అని రెండు చేతులూ ఎత్తి దణ్ణంపెట్టాడు.

ఆ వ్యక్తి ఇంకోసారి నవ్వి,

'పిచ్చివాడా! నాకంటె నువ్వే అదృష్టవంతుడివోయ్!' అన్నాడు.

'ఏమిటి స్వామీ! అలా గంటారు!' గుడ్డివాడు అమాయికంగా అడిగాడు.

'నేనూ బిచ్చగాణ్ణే!' అతను అగాడు. గుడ్డివాడు మొహం ఆశ్చర్యంగా పెట్టి నోరు తెరిచాడు.

'లోకం హెచ్చుతగ్గుల్ని సమానంగా చూడగలవు! మనుష్యుల ఆకారాల్ని కాకుండా మనసుల్ని ప్రార్థించగలవ్!'

గుడ్డివాడికి కిమేం వినపడటం లేదు.

'మరి ఇందాక బూట్ల చప్పుడైంది! బూట్లుగాని ఏమైనా తొడుక్కున్నావా?'

'బూట్లు! మన బతుక్కి తోడు బూట్లు కూడానూ! ఐనా నువ్వు దీవించినట్టు తొడుక్కుందామన్నా అందుకు నోచుకోలేదులే! బూట్లకంటే కూడా నా చెక్క కాలే బాగా చప్పుడు చెయ్యగలదేమోలే, ఐనా'

కొయ్యకాలు సంగతి వినగానే తనకి కళ్ళు రెండూ, (కనీసం ఒక్కటన్నా) వుండి రెండుకాళ్లూ పోగూడదూ? అనుకున్నాడు గుడ్డివాడు.

'కొయ్యకాలంటే ఎలా వుంటుంది?' అమాయికంగా అడిగాడు గుడ్డివాడు.

ఆశ్చర్యంగా చూసి కుంటివాడు 'అయితే నీకు కళ్ళు ఎప్పుడుపోయినయ్!' అన్నాడు.

'ఎప్పుడు పోయినయ్' అనే మాటలు వినగానే గుడ్డివాడు నిస్పృహతో 'అసలు పుట్టేటప్పుడు వుంటేగా పోవటానికి?' అన్నాడు.

(46-వ పేజీ చూడండి)



# ప్రవృత్తులు

(4-వ పేజీ తరువాయి)

జాలిగా కుంటివాడు గుడ్డివాడి వంక చూస్తూ 'ఐతే మనుష్యులంటే ఎలా వుంటారో కూడా నీకు తెలియదన్నమాట!'

'నా మాదిరిగా నే వుంటారేమోగానీ అసలు నేనెల్లా వుంటానో నాకు తెలిస్తేగా!'

'కళ్ళుండి ఈ కుళ్ళు ప్రపంచాన్ని చూళ్ళేక కూసుకునేకంటే అసలు లేకపోవటమే నయమేమో లే!'

నిరాశగా గుడ్డివాడు 'ఏమిటో కళ్ళు లేకపోతే ప్రపంచమే లేదు!' అన్నాడు.

కుంటివాడు మాట్లాడకపోవడం చూసి

'ఏమన్నా! మాట్లాడవేం?' అన్నాడు గుడ్డివాడు.

వులిక్కిపడి కుంటివాడు 'ఏమిటి! అంటున్నావు?' అన్నాడు.

'నువ్వేమిటి ఆలోచిస్తున్నావు' అన్నాడతను.

'అబ్బ! ఏం చీరలూ, ఏం అందం! ఏం నగలు!' తనలో అనుకొంటున్నట్టుగా అంటున్న కుంటివాడి మాటలు విని

'ఏమిటన్నా అవన్నీ!' అని అడిగాడు.


## బహిష్ట

దుర్గాపిల్సు — బహిష్ట టైములో ఎరుపు బట్టవలన కాని. తెలుపు బట్టవలన గాని (White Discharge Red Discharge) బాధపడు వారికి సంజీవివంటిది వేలకువేలమంది ఉపయోగించి తృప్తి పొందినారు. గ్యారంటీ గల ఔషధము 24 గం॥లలో గుణము కనిపించును జీవిత కాలములో తిరిగి రాకుండా కాపాడును.

30 రోజులకు 60 మాత్రలు.

వెల రు 10 V P P చార్జీ ప్రత్యేకము

## హేమ పుష్పమెన్సస్ పిల్సు

బహిష్ట ఏకారణముచేత నైనను ఎన్ని నెలల నుండి ఆగినను గ్యారంటీగా పనిచేయును. చాలామందిచే వాడబడి గ్యారంటీగా బాగు పడిన కేసులు వేలు కలవు.

వారంరోజులకు 30 మాత్రలు.

వెల రు. 10 V P P చార్జీ ప్రత్యేకము.

Sole Agents ;

K R AGENCIES

KAKINADA (S India)

స్టాకిస్టులు కావలెను.


'ఓరి గుడ్డోడా! అవన్నీ చూస్తుంటేనే కడుపు నిండుద్దిగదయ్యా!' అన్నాడు తృప్తిగా.

కళ్ళుండటంవల్ల కలిగే లాభాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నా, ఆ లాభాలూ, ఆ కళ్ళు, తనకేం వుపయోగం కావన్న సంగతి గ్రహించి, అవన్నీ తెలియని గుడ్డివాడి ముఖంలోవున్న నిశ్చలతని చూసి తనెందుకు గుడ్డివాడు కాలేదాఅని విచారించాడు ఒక్కక్షణం.

ప్రపంచంలోవున్న అందాన్నీ, ఆకారాల్నీ అన్నీ చూసి కడుపునింపుకోటానికన్నా నోచుకోలేదేమా అని గుడ్డివాడు తనలో తను కుళ్ళిపోతున్నాడు.

షికార్నుంచీ మెల్లిగా నడుస్తూ ఇంటికి వెళ్తున్న ఒకతన్ని చూసి కుంటివాడు ఒకడుగు ముందుకేసి

'బాబ్బాబూ! కుంటివాణ్ణి బాబూ ఒక్కణా డబ్బులు ధర్మం చెయ్యండి బాబూ!' అని ప్రాధేయపడ్డాడు.

కుంటివాడు మాట్లాడటం చూసి ఎవరో అక్కడికొచ్చారని గ్రహించిన గుడ్డివాడు

'రెండు రోజుల్నుంచీ అన్నం లేదు బాబూ ఒక్కణా ఇప్పించండి బాబూ!' అంటూ చెయ్యి జాపాడు.

కొయ్యకాలువొంక చెయ్యి చూపిస్తూ బాధగా మొహంపెట్టిన కుంటివాడికంటే కూడా ఏమీ సంబంధంలేని వాడిమాదిరిగా వున్నచోట్నుంచీ ఒక్కడుగన్నా ముందుకి కదలకుండా నిశ్చలంగా చెయ్యి జాపిన గుడ్డివాడికే అణా ఇవ్వటం న్యాయమని తోచి ఒకణా వాడిచేతిలో పడేశాడు అతను.

గుడ్డివాడు చేత్తో తాకి చూసుకొని,

'దర్మప్రభువులు' అని రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు అతనికి.

కుంటివాడు అతనివంక కోపంగా చూసి మొహం ఎర్రచేసుకొని, ఈర్ష్యతో కర్ర పోటేసుకొంటూ పెద్దపెద్ద అంగలు వేస్తూ వెళ్ళిపోయాడు.

అమాయకంగా గుడ్డివాడు చేత్తో తడుముతూ 'అన్నా!' అన్నాడు.

అప్పటికే చాలాదూరం వెళ్ళిపోయిన 'అన్న'కి ఈ తమ్ముడిమాట వినిపించలేదు!

★

# గడియారంచెప్పిన కథ

(31-వ పేజీ తరువాయి)

ఆ యిద్దరు వెధవల్నీ చెరొక చంకలోనూ యిరికించుకొని అలాగే వాళ్ళ అత్తవారి వూరిదాకా యీడ్చుకుపోయి, అక్కడ వాళ్ళ అత్తగారి యింటి గుమ్మంలో యిద్దరినీ నిలబెట్టి, బాగా బుద్ధి వచ్చేదాకా తన్ని . ఒదిలిపెట్టాడట. ఇదంతా మీ నాన్నగారే మొన్న ఎవరితోనో చెప్తూంటేవిన్నాను."

తన తాతయ్య గొప్పదనాన్ని గురించి గడియారం గొప్పగా చెప్తూవుంటే సుందరానికి బలే గర్వం పుట్టుకొచ్చింది.

"అప్పటి మనుష్యుల్లాగే, అప్పటి గడియారాలు కూడా గొప్పవి" అని గడియారం స్వాత్రీకరించింది. వాళ్ళ తాతయ్య గొప్పతనంలో యీ గడియారం కూడా కొంత భాగాన్ని కొట్టెయ్యాలని చూస్తున్నట్లు తోచింది సుందరానికి.

"అయితే నీ వయస్సు ఎంత?" అని అడిగాడు.

"ఏం? ఎంత లేకేం ? నే నీ యింట్లో యీ గోడమీదకు ఎక్కి రేపు శ్రావణ మాసంతో పాతికేళ్ళు నిండుతాయి"

"ఆబ్బా! పాతికేళ్ళే?"

"ఆఁ! పాతికేళ్ళు. పాతికేళ్ళపాటు క్షణం వూరికే కూర్చోకుండా పగలూ రాత్రి పనిచేస్తూనే వున్నాను. ఇప్పుడిప్పుడు గుండెల్లో కొంచెం నొప్పిగా వుంటూ వుంటుంది. నాపనీ అయిపోతోంది." అని గడియారం ఒక్క నిట్టూర్పు విడిచింది.

(ఇంకావుంది)